ఓంశ్రీసాయిరాం

## మానవతావిలువలే నిజ బంధువర్గం

సత్యం మాతా పితాజ్ఞానం ధర్మోభ్రాతా దయాస్వసా
శాంతం పత్నీ క్షమాపుత్రః షడేతే సర్వ బాంధవాః

జగత్తులో భౌతిక శరీరమునకు, ప్రాకృతమైన జీవితమునకు, అనిత్యమైన ఈ జీవితమునకు ప్రాకృతమైన తల్లిదండ్రులే, అనిత్యమైన తల్లిదండ్రులే, భౌతికమైన తల్లిదండ్రులే ప్రాప్తిస్తుంటారు. నివృత్తి మార్గములో మనము విచారణ సల్పినప్పుడు నిత్యసత్యమైన మానవునకు ఎవరు నిజమైన బంధువులు అనేది ఈ శ్లోకం చక్కగా వివరిస్తుంది. సత్యము మార్పు చెందునది కాదు. త్రికాలాబాధ్యమైనది సత్యము. అట్టి సత్యమే శాశ్వతమైన, నిత్యమైన, సత్యమైనతల్లి. జ్ఞానం పిత. ఏమిటి ఈ జ్ఞానము? భౌతిక జ్ఞానమా లేక శాస్త్రజ్ఞానమా? కాదు, కాదు. ఇది సత్యమైన జ్ఞానమే. అదియే అద్వైత దర్శనం జ్ఞానం. ఏకత్వము ప్రబోధించే జ్ఞానమే నిజమైన తండ్రి. ధర్మో భ్రాత. మనకు సోదరులుంటారు. కానీ, సోదరులందు ఎన్నోవిధములైన భావము లుంటున్నాయి. కానీ, మారని, చలించని, ఏ మార్పు కల్గని ధర్మమే మనకు నిజమైన సోదరుడు. అతనే దైవము. ఋషులందరూ 'రామో విగ్రహవాన్ ధర్మః' అన్నారు. ధర్మస్వరూపుడు రాముడు. దయాస్వసా. దయచేతనే ధన్యులౌతుంటారు మానవులు. 'అసురుడైనా, భూసురుడైనా, అఖండ తెలివితేటలు కలవాడైనా దయచేత ధన్యుడు కావలెరా!' ఆ దయ దైవమునుండియే ఆవిర్భవిస్తుంది. దయయే సోదరి. శాంతియే పత్ని. శాంతికి మించిన పవిత్రత మరొకటి లేదు. ఈనాడు మనము శాంతి కోల్పోవటముచేత ప్రపంచమంతా అశాంతితో కుమిలిపోతున్నది. శాంతియే దైవము. క్షమ పుత్రుడు. పుత్రుడు లోకములో ఉద్ధారము గావించేవాడని భావిస్తుంటారు మానవులు. భౌతికమైన, లౌకికమైన పుత్రుడు కాదు ఉద్ధారము గావించేది. ఉద్ధరించేవాడు ఉత్తముడైన దైవమే. దీనిని పురస్కరించుకొనియే

త్వమేవ మాతాచ పితాత్వమేవ త్వమేవ బంధుశ్చ సఖాత్వమేవ
త్వమేవ విద్యాద్రవిణం త్వమేవ త్వమేవ సర్వం మమదేవ దేవ.

### సర్వం బ్రహ్మస్వరూపం

జగత్తంతయూ భగవంతుని స్వరూపమే. ప్రతి అణువునందు, ప్రతి కణమునందు ఉన్నది బ్రహ్మయే. కనిపించు పర్వతములు, గాలిని వీచు వృక్షములు, పారాడే పురుగులు, తినే తిండి, పీల్చే గాలి, ఎగిరే పక్షులు సర్వమూ బ్రహ్మస్వరూపమే.

చుక్కలన్నియు బ్రహ్మ సూర్యుండు అది బ్రహ్మ
చంద్రుడన్నను బ్రహ్మ జలము బ్రహ్మ
స్వర్గమన్నను బ్రహ్మ వైకుంఠమది బ్రహ్మ
తల్లియన్నను బ్రహ్మ తండ్రి బ్రహ్మ
భాగ్యమన్నను బ్రహ్మ వాల్లభ్యమది బ్రహ్మ
జీవరాసులు బ్రహ్మ జీవి బ్రహ్మ
పుట్టించుటది బ్రహ్మ పోషించుటది బ్రహ్మ
గిట్టించుటది బ్రహ్మ గృహిణి బ్రహ్మ
కర్మలన్నియు బ్రహ్మ కాలంబు బ్రహ్మ
ప్రకృతియంతయు బ్రహ్మ ఆదిశక్తి బ్రహ్మ
సర్వమును బ్రహ్మ మరియు ఈ సభయు బ్రహ్మ
సత్యమును దెల్పు ఈ సత్యసాయి బ్రహ్మ.

భగవంతుడు శక్తిమయుడు. ఆ శక్తియే ప్రకృతియొక్క ప్రతిబింబము. ప్రకృతియందున్న సమస్త శక్తులు

ప్రకృతిలో జీవించే ప్రతి మానవునియందు ఉంటున్నవి. కనుక, భగవంతుడు, ప్రకృతి, జీవుడు ఈ మూడూ బ్రహ్మతత్త్వములే. జీవుడు వేరు దేవుడు వేరు కాదు. జగత్తు వేరు జగదీశ్వరుడు వేరు కాదు. సర్వం విష్ణుమయం జగత్. ప్రకృతి కార్యము, కార్యకారణ స్వరూపుడే భగవంతుడు. భగవంతుని అన్వేషించుటకు ఎట్టి సాధనలు చేయనక్కరలేదు. మనిషి యందు సమస్త శక్తులు యిమిడి వున్నవి. అజ్ఞాతమైన స్థాయిలో యిమిడి వుంటున్నవి. అజ్ఞాతమనగా ఏమిటి? తెలియని స్థితియే. పాండవులు పన్నెండు సంవత్సరములు అరణ్యవాసము చేసి ఒక సంవత్సరము అజ్ఞాత వాసము చేశారని. అజ్ఞాతమనగా ఎవరికీ తెలియకుండా జీవించటమే. అటులనే సమస్త శక్తులు మానవునియందు అజ్ఞాత వాసము చేస్తున్నాయి.

*మానవుడు మహాశక్తిసంపన్నుడు*

కానీ మానవుడు ఈ సత్యము గుర్తించుకొనలేక తాను అమాయకుడనని, కేవలం అజ్ఞానియని, శక్తిహీనుడని భ్రమిస్తున్నాడు. మానవుడు మహాశక్తిసంపన్నుడు. దీనినే సైంటిస్టులు అన్నివిధముల విచారణ సల్పి వివేకముచేత, విజ్ఞానముతెలుసుకొని అంతా అణుమయం అన్నారు. కానీ, వేదాంతులంతా బ్రహ్మమయం అన్నారు. పేర్లు ప్రత్యేకంగా ఉంటున్నాయిగాని రెండింటి ఏకత్వము ఒకటే. శక్తియే బ్రహ్మ, బ్రహ్మయే శక్తి. జగత్తునందు ఒకవిధమైన శక్తి సర్వత్రా వ్యాపించి వుంటున్నది. మనము చేయునది, చూచునది సర్వమూ శక్తిమయమే. ఈనాడు పదార్థంగా మనకు గోచరిస్తుంది. ఈనాడు జీవుడుగా గోచరిస్తుంది. కడపటికి జీవుడు, పదార్థము శక్తిమయంగా మారిపోతుంది. కానీ, ఈనాటి విజ్ఞానవంతులు energy and matter అని పేరు పెట్టారు. matter అనేదే లేదు. ఈ జగత్తులో అంతా శక్తియే. నీకు కనిపించే సమయంలో matter గా వుండవచ్చు. తిరిగి తదుపరి అది శక్తిలో ప్రవేశిస్తుంది. నీకు కనిపించే సమయంలో జీవుడుగా వుండవచ్చును. తిరిగి ఆ జీవుడు కూడా శక్తిగా మారిపోతుంది. వివిధ రూపనామములతో వుండిన ఈ జగత్తంతా శక్తిమయమే. ఈ శక్తి అనగా ఏమిటి? శక్తి అనగా కేవలము కంటికి కనిపించునది కాదు. చెవులకు వినిపించునది కాదు. హృదయమును మురిపించునది కాదు. శక్తి శక్తియే. ఇదియే దైవత్వము. ప్రతి పదార్థమునకు ఒక ఆధారమున్నది. మానవునియందు విద్యుత్‌శక్తి వుంటుంన్నది. అదే విద్యుత్‌శక్తి జగత్తులో వుంటున్నది. మానవునియందు కాంతిశక్తి వుంటున్నది. అదియే ఈ జగత్తునందు వుంటున్నది. మనిషిలో x-ray శక్తి వుంటున్నది. జగత్తునందు అదే శక్తి వుంటున్నది. ఈ శక్తులన్నింటికీ ఒక ఆధారము వుండాలి. దేనికైనా ఒక ఆధారము వుండాలి. ఈ టేబులుపై టంబర్లుంటుంన్నాయంటే టేబులు ఆధారంగా వుంటున్నది. టేబులు నిలవాలంటే భూమి ఆధారంగా వుంటున్నది. ఒకదానికొకకటి ఆధారంగా వుంటున్నవి. కనుక, ఈ సమస్త శక్తులకు ఆధారభూతుడు దైవము. వీనినే అతీతశక్తులని చెబుతూ వచ్చారు వేదాంతులు. కాని, సైంటిస్టులు సూపర్ పవర్ అన్నారు. పేర్లు వ్యత్యాసముగా వున్నాయి. జగత్తును విచారము చేసినప్పుడు సర్వము ఒక్కటిగానే వుంటున్నది.

*భగవంతుని అష్ట ఐశ్వర్యములు*

ప్రతి మానవునియందు తనకు తెలియని శక్తులు ఎన్నియో వుంటున్నాయి. సైంటిస్టులు అనేక పేర్లతో పిలుస్తూ వచ్చారు. సైక్రోటానిక్ శక్తి, బయోప్లోస్మిక్ శక్తి అన్నారు. వీటినే అతీతశక్తులని వేదాంతులు పిలుస్తూ వచ్చారు. దీనిని మనం ఎట్లా తీసుకోవాలి. దీనిని మానసిక శక్తి చేతను, ధారణ శక్తి చేతను, ధ్యాన శక్తి చేతను, సమాధిశక్తి చేతను, నాల్గింటి ద్వారా అంతర్గతమై వుండిన ఆత్మశక్తిని గుర్తించుటకు వీలవుతుంది. ప్రతి వ్యక్తి, శక్తి పదార్థము కడపటికి దైవత్వముతోనే ఏకమైపోతుంది. అయితే ఇక్కడ చక్కగా విచారణ చేయాలి. మేము దైవములో నిలవాలి, మేము మోక్షమును పొందాలి. మాకు లిబరేషన్ కావాలి. ఎట్లా కలుగుతుంది? దీనిని చక్కగా విచారణ చేయాలి. భగవంతుడు రూపరహితుడు. భగవంతుడు శక్తిమయుడు. భగవంతుడు జ్యోతిర్మయుడు. భగవంతుని అష్టవిధములుగా పిలుస్తూ వచ్చారు.

శబ్దబ్రహ్మమయీ చరాచరమయీ జ్యోతిర్మయీ వాఙ్మయీ
నిత్యానందమయీ పరాత్పరమయీ మాయామయీ శ్రీమయీ.

ఇలాంటి అష్టశక్తులతో కూడిన దైవత్వమును ఏరీతిగా పొందుటకు వీలవుతుంది? నీరు నీరులో చేరగలదు. గాలి గాలిలో చేరగలదు. మట్టి మట్టితో చేరగలదు. భగవంతుడు రూపరహితుడు కాబట్టి, అతనిని మనము చేరాలనుకుంటే మనముకూడా రూపరహితులు కావాలి. రూపరాహిత్యమంటే ఏమిటి? దేహాభిమానము మరవాలి. అదియే ధ్యానము అన్నారు. అనగా దేహాభిమానము ఏనాడు మరచుదుమో అప్పుడు రూపరహితుడైన దైవములో మనము ఏకము కావచ్చును. ఈవిధంగా దేనిలో మనం ఏకం కావాలను కుంటున్నామో దాని స్వరూపము మనం పొందాలి.

*జీవనజ్యోతి, జ్ఞానజ్యోతి, పరంజ్యోతి*

అలా కాకుండా దేహాభిమానము నింపుకొని దైవాభిమానముతో దైవమును ప్రార్థిస్తే ఫలసిద్ధి పొందేది కాదు. భగవంతుడు రూపరహితుడు. ఇలాంటి రూపరహితుని ఏరీతిగా పొందగలరు? కనుక, నీవుకూడా రూపరహితుడు కావాలి. రూపరహితుడు కావాలంటే దేహాభిమానము పోవాలి. భగవంతుడు జ్యోతిర్మయుడు. నీ తత్వము జీవనజ్యోతిగా వెలగాలి. నేనొక జీవిని. నాది జీవనజ్యోతి. అది పరంజ్యోతి. జీవనజ్యోతి పరంజ్యోతినుండియే వచ్చింది. కనుక, ఈ జీవనజ్యోతి తిరిగి పరంజ్యోతిలో లీనము కావాలి. ఎప్పుడు దేహాభిమానము మరతుమో అప్పుడు జీవనజ్యోతి వెలుగుతుంది. దీపావళిదినములలో మీరు చూచి వుంటారు. ఒక జ్యోతిని తీసుకొని అనేక జ్యోతులను వెలిగిస్తారు. కాబట్టి, ఏకంగా ఉన్న జ్యోతి పరంజ్యోతి. అనేక జ్యోతులను అంటించటం చేత అవి జీవన జ్యోతులు. దైవము పరంజ్యోతి. పరంజ్యోతి నుండియే ఈ జీవనజ్యోతులు యేర్పడుతూ వచ్చాయి. కనుక, మనము జీవనజ్యోతులుగా భావించి జ్యోతిని ఏకాగ్రతగా నుంచుకొని, తద్వారా ధ్యానము సల్పి దైవత్వములో లీనము కావాలి. మీరు ప్రత్యేకముగా విచారము చేసి వేరుగా భావించక సక్రమమైన మార్గమును అనుసరించుటకు ప్రయత్నించాలి.

భజన చేస్తున్నారు. జపము చేస్తున్నారు. ధ్యానము చేస్తున్నారు. తపము చేస్తున్నారు. యజ్ఞము చేస్తున్నారు. యాగములు చేస్తున్నారు. వ్రతములు చేస్తున్నారు. ఇవన్నీ ప్రాకృతమైన, లౌకికమైన ప్రవృత్తి మార్గములే గాని నివృత్తి మార్గములు కాదు. ఇవి సత్కర్మలు. ఇవన్నీ ఆధ్యాత్మికము కాదు. ఆత్మకు సంబంధించినదే ఆధ్యాత్మికము. కానీ, ఇవి లౌకిక జగత్తుకు సత్కర్మలుగా రూపొందుతాయి. అయితే ఎట్టి కర్మలకు అట్టి పుష్టిత్వము మనకు ప్రాప్తిస్తుంది? ఫలము తప్పక వుంటుంది. దీనికి ఫలితము సత్కర్మలకు సంబంధించిన ఫలితము వుంటుంది. ఆత్మకు సంబంధించిన ఫలితములు రావు. కనుక, ఈ కర్మలు సత్కర్మలుగా ఆచరించి ఈ సత్కర్మనుంచి దివ్యమైన ఆత్మ సంబంధమైన దానిలో మనము ప్రవేశించాలి. ఎంతకాలమైనా ఈ సత్కర్మలలోనే వుంటే మనము పవిత్రమైన మార్గము ఎప్పుడు పొందేది? ఈ సత్కర్మలన్నీ ద్వైతముతో కూడినవి. ద్వైతమునుండి అద్వైతములో ప్రవేశించాలి. అద్వైతములో చేరినప్పుడే నీవు జ్ఞానిగా మారిపోతావు. 'అద్వైత దర్శనం జ్ఞానం'.

*దేహం అనేక రకాల శక్తుల జనరేటరు*

నీ దేహములో కావలసినన్ని ఖనిజములుంటున్నాయి. పంచభూతములంతా దేహములో ఏర్పడిన ఖనిజములే. ఖనిజ సంపత్తి మన దేహములో నఖశిఖ పర్యంతము వుంటున్నది. చింతపండు వల్ల, లైమ్‌జ్యూస్ వల్ల, బత్తాయి రసము వల్ల ఏర్పడేది ఆమ్లము. ఈ ఆమ్లము ఈ ఖనిజ సంపత్తితో చేరినప్పుడు కరెంటు ప్రారంభమౌతుంది. కనుక, దేహము ఒక చిన్న జనరేటరు వంటిది. జనరేటరే కాదు నీలో ప్రవేశించిన భావములన్నీ నీ నోటి ద్వారా వెలుపల పడుతున్నాయి. కాబట్టి, మానవుడు రేడియో వంటి వాడే. రేడియో సోర్సు

మానవునియందు వుంటున్నది. నీవు పూర్వము దర్శించిన ప్రతి పదార్థము నీవు తలచుకుంటే చూడగలుగుతున్నావు. ఇదే నీలో టి.వి. కాబట్టి టి.వి., రేడియో, అయస్కాంతశక్తి, విద్యుత్‌శక్తి అన్నీ నీలో వుంటున్నాయి. జగత్తంతా ఒక దివ్యమైన ఆకర్షణ శక్తి. ఈ ఆకర్షణ శక్తి సర్వులను ఆకర్షిస్తుంది. దీనినే అయస్కాంతమన్నారు. ఏది అయస్కాంతమని పిల్లలను అడిగినప్పుడు 'ఇనుపముక్క తీసుకుపోతే అది ఆకర్షిస్తుంది, దానిని అయస్కాంతమని అంటారు. చాలా పొరపాటు. ప్రపంచములో వున్నదంతా మేగ్నెట్టే. పచ్చగడ్డిని చూచి పశువు పరుగెత్తి పోతుంది. ఈ రెండింటి మధ్య మేగ్నెట్టే. పిల్లలను చూచి తల్లి ఆప్యాయంగా పెడుతుంది. తల్లికి బిడ్డకు మధ్య నున్నది మేగ్నెట్టే. భార్యాభర్తల మధ్య నున్నది మేగ్నెట్టే. ముంగిసకు, పాముకు మధ్యనున్నది మేగ్నట్టే. పుష్పమునకు, తుమ్మెదకు మధ్యనున్నది మేగ్నెట్టే.

'రమయతి ఇతి రామః' అన్నారు. సర్వులను రమింపచేసేవాడు రాముడు అన్నారు. రాముడు ఎవరు? దశరథరాముడా, ఆత్మారాముడా? ఆత్మారాముడు! అన్నీ చేరి అన్నింటిని ఆకర్షిస్తుంది. ఈనాడు యింతమంది యిక్కడకు వచ్చి చేరారంటే ఈ ఆకర్షణయే మూలకారణము. సహజమైన పూవులు పెట్టినప్పుడు తుమ్మెదలు వాలుతుంటాయి. దీనిలో మధురమైన, పవిత్రమైన మకరందము వుండటం చేతనే. అదే ప్లాస్టిక్ పుష్పము పెడితే ఏ తుమ్మెద అక్కడకు రాదు. ఈ మకరందమే ప్రేమ. ఈ ప్రేమయే సర్వులను ఆకర్షిస్తుంది. తల్లి ప్రేమ కావచ్చు, తండ్రి ప్రేమ కావచ్చు, స్నేహప్రేమ కావచ్చు. అందరినీ ఆకర్షించేది ప్రేమ మాత్రమే. ఆ ప్రేమయే శక్తివంతమైన అయస్కాంతము. ఆ అయస్కాంతము ప్రపంచమంతా నిండి వుంటున్నది. ప్రపంచములో నుండిన అయస్కాంతము మనము ప్రపంచములో నుండిన వారము కనుక ఆ అయస్కాంతము మానవులలో ప్రవేశించింది. తల్లిదండ్రులకు పుత్రుడు పుట్టినప్పుడు తల్లిదండ్రుల రూపు పుత్రునకు చేరుతుంది. అదేవిధముగా జగత్తునుండి ఆవిర్భవించిన జీవుడు కూడ జగత్తుయొక్క స్వరూపమును పొందును.

*ఆత్మయే అణువు, అదే దైవతత్త్వం*

సృష్టి ఈశ్వరేచ్ఛకు ప్రమాణమే. ప్రకృతియందు పుట్టిన ప్రతి మానవునికి ఈశ్వరభావమే రావాలి. ప్రతి మానవుడు జగత్తులో ఆవిర్భవించుటకు మూలకారణము ఈ ఈశ్వరత్వము పొందటము కోసమే. ఆ ఈశ్వరత్వము ప్రకటించే నిమిత్తమై మూర్తీభవించిన వాడే మానవుడు. జగత్తునందు పుట్టిన ప్రతి వ్యక్తి, ప్రతి పదార్థము దైవ స్వరూపమే. అదియే శక్తి. ఈ శక్తి ఒకరు పుట్టించేది కాదు. ఒకరు దీనిని నాశనము చేసేది కాదు. ఇది అవినాశి. దైవశక్తి అవినాశి. అయితే ఒక శక్తినుండి మరొక రీతిగా మార్చుటకు వీలవుతుంది. అయస్కాంత శక్తిని విద్యుత్ శక్తిగా మార్చవచ్చు. విద్యుత్ శక్తినుండి కాంతి శక్తిగా మార్చవచ్చు. కాంతి శక్తిని అణు శక్తిగా మార్చవచ్చు. ఈవిధంగా శక్తి అనేక రూపములుగా మార్చవచ్చునేగాని శక్తిని లేకుండా చేయుటకు వీలుకాదు. అట్టి మార్పు చెందనిదే, నాశనము కానిదే దైవత్వము. కనుక, దైవత్వము లేని ప్రపంచము గానీ, స్థానముగానీ లేదు. ప్రతి అణువునందు, ప్రతి కణమునందు దైవత్వము వుంటున్నాది. ప్రాచీనులందరూ

*సూక్ష్మమైనట్టి అణువున సూక్ష్మమగుచు*
*మేటి వస్తువునందున మేటియగుచు*
*అంతటను సర్వసాక్షియై అలరునట్టి*
*ఆత్మయే అణువు అణువె బ్రహ్మంబుయగును.*

బ్రహ్మ, అణువు, ఆత్మ మూడూ పర్యాయ పదములు మాత్రమే. సర్వత్రనున్న దైవత్వము ఒక్కటేయని తెలుసుకొనుటకు సైంటిస్టులకు వేయి సంవత్సరములు పట్టింది. కానీ, వీరు తెలుసుకొన్నది చిన్న ఆవగింజంత. గుమ్మడికాయంత అహంకారపడుతున్నారు.

*ప్రహ్లాదుని దైవపారవశ్యం*

ఈ సత్యమును కొన్ని వేల సంవత్సరములకు పూర్వము, కృతయుగములో చిన్న బాలుడైన ప్రహ్లాదుడు గుర్తించాడు. ఈ తత్త్వమునే

*ఇందుకలడందులేడని*
*సందేహము వలదు చక్రి సర్వోపగతుం*
*డెందెందు వెదకిజూచిన*
*నందందే గలడు.....*

అని ఆనాడు ప్రహ్లాదుడు చెప్పాడు. ఎక్కడ చూచినా ఉన్నది భగవత్తత్త్వమే. ఎక్కడ చూచినా వున్నది అణుతత్త్వమే. అణుతత్త్వమే దైవత్వము. అణువులోను, ఘనములోను వున్నది దైవత్వమనే ఏకత్వము గుర్తించటం చేత ప్రహ్లాదుడు అన్నింటిని సాధించుకొని దేహాభిమానమును మార్చటం చేత దైవత్వములో లీనము పొందాడు. దేహాభిమానమే వుంటే పర్వతమునుండి క్రిదకు వేసే సమయంలో అయ్యో, క్రింద పడతానేమోనని భయముండేది. కానీ, అతనికి లేదు. 'నారాయణ, నారాయణ' అని నవ్వుకుంటూ క్రింద పడ్డాడు. మదగజములను తెచ్చి త్రొక్కిస్తుంటే అప్పుడుకూడా మదగజముతో తొక్కితే నేనేమైపోతానోననే భయము లేదు. 'నారాయణ, నారాయణ'అని నవ్వుకుంటూనే వున్నాడు. విష సర్పములచేత కరపించుకుంటూ వచ్చారు. వాటిని చూచి పూల మాదిరి తీసుకొని 'నారాయణ, నారాయణ' అన్నాడు. ఈవిధంగా సర్వ వేళల దేహాభిమానము వదలి దైవాభిమానముతోనే జీవిస్తూ వచ్చాడు. అందులనే ప్రతి అణువు దైవమేనని ప్రపంచమునకు చాటుతూ వచ్చాడు. అతని గురువులు హిరణ్యకశిపుని దగ్గరకు వచ్చి, 'అయ్యా! ఏమిటి ఈ బిడ్డ మాహాత్మ్యము? కించిత్తైనా దేహాభిమానము లేదు.

*తన్ను నిశాచరుల్ పొడవ దైత్యకుమారుడు మాటిమాటికో*
*పన్నగశాయి! ఓ దనుజభంజన! ఓ జగదీశ! ఓ మహా*
*పన్న శరణ్య! ఓ నిఖిల పావన! యంచు నుతించెగాని తా*
*కన్నుల నీరు తేడు, భయకంపసమేతుడుకాడు భూవరా!*

ఇంత చిన్నపిల్లవానికి భయమనేది లేదు. కన్నీరు కార్చ లేదు. ఆనందముతో ఎంతో ఉత్సాహంగా, ఉల్లాసంగా దైవచింతన చేస్తున్నాడు. ' అనగా దైవత్వము గుర్తించిన ప్రతి వ్యక్తికి నిరంతరము ఆనందమే తప్ప విచారమనేది యేమాత్రము వుండదు. ఎవరు విచారము చేసేది? దేహాభిమానము గలవారే విచారము చేసేది. ఈ దేహానికి సంబంధించిన కష్టములకు, నష్టములకు, దుఃఖములకు, విచారములకు చింతించి విచారము చేస్తుంటారు. దేహము ఒక పనిముట్టు. పుట్టినది గిట్టక తప్పదు. పుట్టుకతోబాటు గిట్టుట దీనితో వచ్చినది. ఎందుకు మనం విచారం పొందాలి? ఏనాటికైనా తప్పునది కాదనే సత్యము గుర్తించిన వ్యక్తికి నిరంతరము ఆనందమే.

*గోపికల తన్మయత్వం*

కృష్ణుని గోపికలు ప్రార్థిస్తూ అనేక రీతులుగా విచారిస్తూ వచ్చారు. నిన్ను ఏవిధంగా వర్ణించాలి కృష్ణా! నిన్ను ఏవిధంగా తెలుసుకోవాలి? ఎట్టి రూపము ధ్యానించాలి? ఏ నామము స్మరించాలి? మాకు తెలియటం లేదు. ఎందుకోసం..

*అణువుకంటె అతి సూక్ష్మరూపుడవు*
*ఘనముకంటె అతి గణనీయుడవు*
*ఎనుబది నాలుగు లక్షల జీవముల*

*అనయమ్మునెడబాయకుందువట*
*అణురేణు తృణ కాష్ఠము మొదలుగ*
*అఖండరూపుడవై వెలయుచుందువట. కృష్ణా!*

ఎట్లా నిన్ను తెలుసుకొనేది? ఆ గోపికలు ఏ శాస్త్రములు చదవలేదు. ఏవిధమైన వేదాంతము చూడలేదు. ఎట్టి గురువులు లేరు. వారి లోపలనున్న దివ్యమైన శక్తి ఆవిధముగా ఆవిర్భవించింది. ప్రతి వ్యక్తియందు అతీతమైన శక్తులుంటున్నాయి. ఆ శక్తిని సద్వినియోగపరుస్తూ వచ్చినప్పుడే ఈ శక్తి మరింత అభివృద్ధి అవుతుంది. కనుక, మనయందున్న శక్తిని సద్వినియోగ పరచాలి. బావియందున్న నీరు తోడుతూ వచ్చినప్పుడే ఆ బావిలో కొత్త నీరు అభివృద్ధి అవుతుంది. మనకు తెలిసిన జ్ఞానము పదిమందికి బోధిస్తూ బోధిస్తూ రాగా మన జ్ఞానము కూడా పెరుగుతుంది. మనకున్న ధనము దానము చేస్తూ చేస్తూ రాగా ధనముకూడా పెరిగిపోతుంది. ఉన్న జలమంతా ప్రవహిస్తూ పోతే కొత్త జలము వస్తుంది. జలము ముందుకు పోకపోతే నిల్చిన నీటిలో పురుగులు పడతాయి. కనుక, మనయందున్న శక్తిని మనము ఆవిర్భవింప చేసుకొని అందరికీ పంచిపెట్టటానికి ప్రయత్నించాలి.

*అమనస్కయోగంతో దివ్యశక్తులు*

మనలో లేని శక్తులు జగత్తులో లేవు. జగత్తులో లేని శక్తి దైవములో లేదు. దైవశక్తియే జగత్తుయందుంటున్నది. జగత్తు శక్తియే మానవునియందుంటున్నది. కానీ, మనకు తెలియని స్థితిలో వుంటున్నది. ఈ అజ్ఞాత శక్తిని ప్రయత్నపూర్వకంగా సాధిస్తే ఎంతైనా మనం సాధించవచ్చు. ఏమాత్రము దీనికి సందేహము లేదు. అయితే మనము కొన్ని దురభ్యాసములకు గురైపోతూ వచ్చాము. దేవుని పొందాలనుకుంటే రాంరాంరాం అనుకుంటే చాలదా అనుకుంటాం. ఆ రామనామంతో దేవుని పొందలేము. ధ్యానము చేస్తే రామతత్త్వం పొందవచ్చు కదా అనుకుంటాం. ధ్యానము చేసేది, నామము సల్పేది, యజ్ఞయాగాదులు చేసేది మనస్సుయొక్క తృప్తి, మనస్సును అమనస్కంగా భావించుకోవాలి. మనసుస్సండింనంత వరకు ఈ విచారములు తప్పవు. మనస్సుండింనంత వరకు దైవత్వము గుర్తించలేము. అమనస్కుడు కావాలి.

*అంతను తానాయె అంతయు లోనాయె*
*మాయకు లోనాయె మాయ తానాయె*
*మాయ యిరువదియైదు మంత్రములాయె*
*మాయ యిరువదియైదు మంత్రములు తెలుసితే*
*మాయ మాయ మాయ మరిబయలాయె.*

అంతా మాయ తత్త్వంగా కనిపిస్తుంది. నిద్రలో నీవు యేవిధంగా స్వప్నము పొందుతున్నావో ఆవిధంగా జగత్తులోపల నీ పనులన్నీ స్వప్నము మాదిరి కనిపిస్తున్నాయి. ఇది day dream, అది night dream. అయితే day dream లో night dream లేదు. night dream లో day dream లేదు. నీవు day dream లో వున్నావు night dreamలో వున్నావు. you are omnipresent. అలాంటి ఏకత్వము మనము విశ్వసించాలి. రాత్రి కలలో యేమో చూచాను. కాని, జాగ్రత్తలో లేవే. కలలో చూచిన మేడలు మిద్దెలు కన్నులు విప్పిన లేవు కదా! పగలు చూచినవి కలలో మర్చిపోయాము. పగలు సాయికుల్వంత్ హాలులో కూర్చున్నావు. కానీ, నీకు స్వప్నము వస్తే బొంబాయిలో వుంటున్నావు. దీని గతి యేమిటి? దాని గతి ఏమిటి? బొంబాయి లోనిది నిజమా? లేక సాయికుల్వంత్ హాలులోనిది నిజమా? ఇది నిజము కాదు. అది నిజము కాదు. అందులోను నీవు వున్నావు. ఇందులోను నీవు వున్నావు. నీవు రెండు కాదు ఒక్కటే. పరిస్థితులు మాత్రం రెండు. ఈ రెండు స్థితుల వలననే మన మనస్సు అనేకవిధములుగా తికమకలైపోతున్నది.

*సమాధిలో అతీత శక్తులు*

మొట్టమొదట దైవత్వమును గుర్తించాలనుకున్నప్పుడు క్రమక్రమేణా ధ్యానం చేయండి. ఈ ధ్యానము చేత ఏకాగ్రత కుదురుతుంది. ఏకాగ్రత కుదిరినప్పుడు అమనస్కమనే మార్గమునకు వస్తుంది. అమనస్కమనే స్థితికి వచ్చినప్పుడే దేహాభిమానము పోతుంది. దేహాభిమానము పోయినప్పుడే సమాధి స్థితి వస్తుంది. ఈ సమాధిస్థితి అంటే రెండర్థములుంటున్నాయి. లాభనష్టములను, కష్టనష్టములను, పాపపుణ్యములను రెండింటిని సమానముగా చూచుకోటం సమాధి. సమ ధీ బుద్ధి సమానంగా వుండాలి. దుఃఖములకు కృంగకూడదు. సుఖములకు పొంగకూడదు. దీనివల్లనే అతీతశక్తులు మననుండి ఆవిర్భవిస్తాయి. మానవునియందు లేని శక్తులు మరొక చోట లేవు. నీయందున్న శక్తులే మరొక చోట వున్నాయి. ప్రపంచమంతా ఈ శక్తులతోటే నిండి వుంటున్నది. ఇలాంటి శక్తుల తత్త్వము మొట్టమొదట గుర్తించాలి. ఈ ప్రాకృత జీవితములో వున్నంత వరకు మానసిక సాధనలు సల్పాలి. వేరుగా భావించ వద్దు. ప్రాకృతమైన గురువులచేత మనము నిత్యసత్యమును అనుభవించలేము. వారు చెప్పే బోధల చేత మానవత్వము మరింత అడుగున పడిపోతున్నది.

*ఆత్మజ్ఞానియే నిజగురువు*

గురువు అనే పదమును మొట్టమొదట అర్థము తెలుసుకోవాలి. బోధించువాడు కాదు గురువు. మంత్రమును ఉపదేశించేవాడు కాదు గురువు. గు రు. అజ్ఞానము నిర్మూలము గావించేవాడు గురువు. 'గు' కారము గుణాతీత తత్త్వము. 'రు' కారము రూపరహితము. గుణము, రూపము లేనివాడు దైవము ఒక్కడే. కనుక, 'గురుర్ బ్రహ్మ గురుర్ విష్ణుః గురుర్దేవో మహేశ్వరః' అన్నారు. నిజమైన గురువు దైవము ఒక్కడే. వీరందరూ కేవలము టీచర్సు వంటివారు. విద్యార్థి కాలేజీలో ప్రవేశించినప్పుడు లెక్కల టీచరు, పిజిక్సు టీచరు, కెమిస్ట్రీ టీచరు వుంటారు. ఇంతమందిని ఎట్లా పూజించుటకౌతుంది? ఉన్నది ఒక్క గురువే. ఒక్కొక్క సబ్జక్టుకు ఒక్కొక్క టీచరు వుంటారు. వీరంతా బోధించేవారు. గురువు తన గురిని చూపించాలి. గురి అనగా ఆత్మతత్త్వములో చేర్చాలి. అదే గురి. నిర్మలమైన మనస్తత్త్వమే గురుత్వము. తన్ను తాను తెలుసుకున్న వాడే నిజమైన గురువు.

*శుక్ర ద్రోణులు నిజ గురువులు కాదు*

చిన్న ఉదాహరణము. కృతయుగములో శ్రీమన్నారాయణుడు వామనావతారము తీసుకొని బలిచక్రవర్తిని సరియైన మార్గములో పెట్టే నిమిత్తమై దానము అడగటానికి వెళ్ళాడు. బలిచక్రవర్తి గురువు శుక్రాచార్యుడు. ఆచార్య.. ఆచరించినవాడు. అనేక వేలమందికి గురువు ఆచార్యుడు. బలిచక్రవర్తి వామనుడు నారాయణుడని తెలుసుకొని అతనికి సర్వమూ అర్పించుటకు సిద్ధమయ్యాడు. 'ఇస్తాను' అని మాట యిచ్చాడు. శుక్రాచార్యుడు, 'వద్దు, వద్దు. నీవు చాలా మోసపోతావు. రాజ్యమంతా భ్రష్టయిపోతుంది. నీవు అతనికి యేమాత్రము మూడడుగులు దానము యీయవద్దు' అన్నాడు. ఆ సమయంలో దైవము కంటె గురువు యేమిటని ధిక్కరించి 'పలికి బొంకుట కంటెను పాపమున్నె' ఏమైనా సరే, గురువు శపించినా ఫరవాలేదు. నేను భగవంతునికి అర్పితము చేస్తానన్నాడు. దైవమునకు అర్పితము చేస్తుంటే వద్దని చెప్పేవాడు గురువా?

ద్వాపరయుగములో పాండవులకు అన్నిరకములైన విద్యలు బోధించుటకు ఏకైక గురువుగా వచ్చాడు ద్రోణాచార్యుడు. ద్రోణాచార్యుడు ప్రోమిస్ చేశాడు. నీకు తప్ప మరొకరికి గురువుగా వుండను. నా శక్తి అంతా నీకే అర్పితము చేస్తాను. మరొకరికి చేయను. ఆ ధైర్యముచేత అర్జునుడు విఱ్ఱవీగిపోయాడు. అన్ని విద్యలు నేర్చాడు. ద్రోణుడు చెప్పినట్లుగా ఎవరికీ గురువుగా పోలేదు. ఒకానొక సమయంలో ఏకలవ్యుడు వచ్చి, 'స్వామీ! నాకు విద్య నేర్ప'మని ప్రార్థించాడు. 'నేను అర్జునునికి ప్రోమిస్ చేశాను. అర్జునునికి తప్ప మరొకరికి గురువును కాను' అన్నాడు. అంతవరకు సంతోషమే. పాండవులు, కౌరవులు అరణ్యమునకు వెళ్ళారు విహారార్థమై. వారి వెంట కుక్కలను తీసుకు వెళ్ళారు. ఒక మృగము చూచి కుక్క అరచింది. ఆ అరపును విని ఎక్కడనుండో నాలుగైదు

అంబులు వచ్చాయి. ఐదు ఒక్కతూరి పడ్డాయి. అర్జునుడు చాలా ఆశ్చర్యపోయాడు. శబ్దమును పురస్కరించుకొని అన్ని అంబులు వేసిన గొప్ప విద్యావంతుడు ఎవరా అని అరణ్యములో వెతుకుతూ పోయారు. గొప్పశక్తివంతుడుగా వుంటున్నాడు. ఈ శక్తి నాకు లేదే. తనకు లేక పరులకు వుండినప్పుడు అసూయ వస్తుంది. వెతికేటప్పటికి ఒక పూరిగుడిసె లోపల ఒక బోయివాడు ఒక అంబుని పట్టుకు నిల్చున్నాడు. అతనిని చూసారు. 'నీవేనా వానిని వదలినది' అని అడిగాడు. 'అవును' అన్నాడు. 'నీకు ఎవరు గురువు?' అని అడిగాడు. ద్రోణాచార్యుని ప్రార్థించాడు. ద్రోణుడు ఒప్పుకోకపోవటం చేత ద్రోణాచార్యుని పాదములనే గురువుగా భావించి ఈ విద్యలు నేర్చుకున్నాడు. అతనికి తెలియకుండా ద్రోణాచార్యుడే నా గురువు' అన్నాడు. అర్జునుడు మండిపోయాడు. నాకొకవైపున ప్రామిస్ చేసి తిరిగి ఈ వ్యక్తికి యిన్ని విద్యలు నేర్పాడని చాలా కోపంగా యింటికి వెళ్ళిపోయాడు. ద్రోణాచార్యుని అడిగాడు. ద్రోణాచార్యుడు సత్యమే చెప్పాడు. 'నేను ఎవరికీ గురువును కాదు. నేను ఏకలవ్యునికి గురువును కాను. నా దగ్గరకు వచ్చి ప్రార్థించాడు కానీ నేను అంగీకరించలేదు' అన్నాడు. కానీ అర్జునుడు చాలా మండిపడ్డాడు. నాకంటె గొప్పవాడు వున్నాడు ఈ లోకంలో. పెద్ద అసూయ. అతని శక్తిని ఎట్లాగైనా నిర్మూలం గావించాలని సంకల్పం గావించుకొన్నాడు. నా కంటె అధికుడు ఈ లోకంలో వుండకూడదు. కాబట్టి, దీనికి తగిన ప్రయత్నం చేయమన్నాడు ద్రోణాచార్యుని. ద్రోణాచార్యుడు విధిలేక, ఈ గొప్పదనము చూచి లొంగిపోయాడు. రాజుకు విరుద్ధంగా పోతే నా గతి యేమవుతుందోనని భయపడ్డాడు. స్వార్థమైన బుద్ధితో కుయుక్తి పన్ని అడవియందు నివసించే ఏకలవ్యుని దగ్గరకు పోయి, 'ఏకలవ్యా! నీకు గురువు ఎవరు?' అని అడిగాడు. 'నీవే గురువు' చెప్పాడు. ఎంతో గౌరవముగా చెప్పాడు. ఇతను గురువు కాకపోయినప్పటికి, మానసికంగా 'నీవే నా గురువు' అన్నాడు. అయితే గురుదక్షిణ ఏమిస్తావు?' అన్నాడు. 'ఏది అడిగితే అది యిస్తాను' అన్నాడు. అన్నింటికీ సిద్ధమే వాడు. ఎందుకంటే, గురువుపై విశ్వాసము అట్టిది. అంత విశ్వాసముగా వుండినవానికి గురువు చాలా ద్రోహము చేశాడు.

*దక్షిణాంగుష్ఠమిచ్చిన దానజేసి*
*బాణ సంధాన లాఘవ భంగమయిన*
*నెఱుకు విలువిద్య కలిమికి హీనుడయ్యె*
*బార్థునకు మనోరుజయును బాసెనంత!*

అర్జునుని మనస్సు తృప్తిపరచే నిమిత్తమై ఏకలవ్యుని దక్షిణ అంగుష్ఠమును దక్షిణగా కోరాడు. ఇది గురువు చేసే పనియా! కాదు, కాదు. ఇలాంటి ప్రాపంచిక గురువులు స్వార్థమునకు, స్వప్రయోజనమునకు వినియోగించుకొని నిజమైన ఆత్మజ్ఞానమునకు దూరము గావిస్తున్నారు. వీరందరూ వ్యావహారిక గురువులే గానీ ఆత్మ సంబంధమైన గురువులు కాదు. ఎవరితోనైనా విద్యను నేర్చుకో, తప్పు లేదు. కానీ, అర్పితము మాత్రము భగవంతునికి మాత్రమే కావాలి. అదే నిజమైన భక్తి. అదే నిజమైన ఆధ్యాత్మికము.

మర్మమెరిగిన మనసే గురువు

లోకానికి ఎన్నియో బోధలు చేశాడు వ్యాసుడు. 'వ్యాసో నారాయణో హరిః' అన్నారు. అతను నారాయణ స్వరూపుడే అన్నారు. అనేక వేదములుగా నున్న దానిని ఉద్ధరించుటకు చాలా కష్టమవుతుందని నాలుగు వేదములుగా విభజించి లోకమున కందించాడు. అలాంటి విభాగము గావించిన వ్యాసునికి హృదయము పవిత్రంగా మారిపోయింది. ఈ ప్రపంచమునకు పవిత్రమైన వేదమాతను అందించానుకదాయని తృప్తి పడ్డాడు. ఆ సంతృప్తి పడిన దినమే పూర్ణిమ. పూర్ణముగా వుంటున్నాడు చంద్రుడు. చంద్రునకు, మానవుని మనస్సుకు సంబంధము వుంటున్నది. ఆ వేదమే, 'చంద్రమా మనసోజాతః చక్షోః సూర్యో అజాయత' చంద్రుడు, మనస్సు రెండు ఒక్కటే. బింబ ప్రతిబింబములే. పూర్ణిమ దినమున పూర్ణచంద్రుడు ఏవిధముగా పూర్ణముగా వుంటాడో ఆ విధముగా మనసు పూర్ణముగా వుంటుండాలి. ఎట్టి దోషములు లేకుండా, ఎట్టి మచ్చలు లేకుండా, ఎట్టి దురభ్యాసములు లేకుండా, పవిత్రముగా, స్వచ్ఛముగా వుంటుండాలి. ఈనాడు పవిత్రమైన భావముతో వేదములు విభజించినవాడు కనుక, వ్యాసపూర్ణిమ అని పేరు పెట్టారు. గురుపూర్ణిమ కాదు. హృదయమును యేనాడు

పరిశుద్ధము గావించుకుంటామో ఆనాడే గురుపూర్ణిమ. 'మర్మమెరిగిన మరు నిముషములో మనసే వారికి గురువండీ' అన్నారు. మర్మము ఏనాడు తెలుసుకుంటాడో ఆనాడు తన మనస్సే గురువు అవుతుంది.

*దేహం ఏడు ప్రాకారాల కోట*

రామదాసు చెప్పాడు.

*కోట ఏడుచుట్లురా కోటలోపల తోటరా*
*తోటలోనికి పోదమంటే దారి తెలియదు ఎట్లరా*
*పాటువైనది చెట్టురా పట్టు అయినది కొమ్మరా*
*పాటు తప్పి పట్టు విడిచితె పరబ్రహ్మయె చేరురా!*

మానవత్వానికి ఏడురకములైన కోటలుంటున్నాయి. ఏమిటవి? కామక్రోధలోభమదమాత్సర్యములనే ఆరు కోటలుంటున్నాయి. అన్నింటి కంటె పెద్ద కోట ఏడవది, దేహాభిమానము. ఈ ఏడు కోటలకు మధ్యలో వుంటున్నాడు భగవంతుడు. క్రింద వున్నది చెట్టు. చేతితో పట్టుకొన్నది కొమ్మ. కొమ్మ విరిగిపోతే నీకేమి గతి? భగవంతుడే చెట్టు వంటివాడు. గురువులు కొమ్మలవంటివారు. చెట్టును ఆశ్రయించిన వారికి ఏమి ప్రమాదము జరుగదు. దైవమే నిజమైన గురువు.

*భ్రూమధ్యస్థానమున దృష్టి నిలుపు*

ప్రేమస్వరూపులారా! జగత్తంతా ఏ శక్తితో నిండి వున్నదో ఆ శక్తి మీయందుకూడా వుంటున్నది. దైవము మీకంటె వేరు కాదు. మీకంటె దైవము వేరు లేదు. I and you are one. ఒక్క ఏకత్వము భావించుకొని దైవము నాయందే వుంటున్నాడు. నేనే దైవము అనే విశ్వాసము బలపర్చుకోవాలి. నేను ఫలాని రామయ్యను, కృష్ణయ్యను అనుకుంటే లాభము లేదు. ఈ పేరు తల్లిదండ్రులు పెట్టారు. పెట్టిన పేర్లు గాని పుట్టిన పేర్లు కాదు. ఈ దేహమును తల్లిదండ్రులే పుట్టించింది. కాబట్టి దైవము భద్రమైనదిగా వుంచాలి. మీరాను బయటకు పొమ్మన్నాడు, రాణా. ఎందుకంటే తనకు అవమానము జరిగిందని. కానీ, కృష్ణుని వదలిపోవటం కష్టమైంది. కొంతసేపు యోచించుకొంది. ఈ మందిరము మహారాణా కట్టినది. నా హృదయమే భగవంతుని మందిరము. 'చల్‌రెమన్ గంగా యమునా తీర్'. ఓ మనసా, నీవు అక్కడికి ఇక్కడికి పోవద్దు. వీరికి వారికి యేమాత్రము జంకవద్దు. ఇడ పింగళ నాడుల మధ్యనున్నదే భ్రూమధ్యస్థానము. అక్కడ నీకు శాంతి లభిస్తుంది. భ్రూమధ్యస్థానమున దృష్టి పెట్టుకో. ఈ మందిరము వైపు ఆ మందిరము వైపు దృష్టి పెట్టుకోవద్దు. శ్రీకృష్ణుని శరీరము ఎలాంటిది? నాశనము లేని శరీరము. పవిత్రమైన శరీరము. మధురమైన శరీరము. ఆనందమునిచ్చే శరీరము. అలాంటి శ్రీకృష్ణుడు భ్రూమధ్యస్థానములో వుంటున్నాడు. అక్కడకు నీవు వెళ్లమంది.

మానవునియందే సర్వమూ వుంటున్నది. సర్వస్వము మన దేహమందే వుంటున్నది. సర్వస్వము నీవు పెట్టుకొని ఎక్కడో వెతకటమేమిటి? నీ యింట పంచభక్ష్య పరమాన్నములు వుంటుంటే పరాయి ఇంట పాచిపోయిన పప్పు ఎందుకు అడుగుతావు? ఇంటిలోన జ్యోతి వెల్గుచునుండగ, పరుల యింటికగ్గికరుగనేల? ఎందుకు వెళ్ళాలి? నీ దగ్గరే వుంటున్నది జ్యోతి. ఇంకొకరి ఇంటికి పోయి ఎందుకు అడగటము. ఆ జీవనజ్యోతి నీయందే వుంటున్నది. ఆ పరంజ్యోతి నీయందే వుంటున్నది. ఆత్మజ్యోతి నీయందే వుంటున్నది. అద్వైతజ్యోతి నీయందే వుంటున్నాది. ఆనందజ్యోతి నీయందే వుంటున్నది. కనుక, దీనికి మనము వెరువనక్కరలేదు.

దైవత్వమును విడువకూడదు.

*భగవంతుడు హృదయవాసి*

*హెచ్చుగ సంపదలొచ్చినగాని ఏనుగు గుఱ్ఱములెక్కినగాని*

*పిచ్చోడని పేరొచ్చినగాని ప్రీతిగ ప్రజలు పిలిచినగాని*
*దేవుని మరువకురా నరుడా! నామము విడువకురా!*

ఈవిధమైన తత్త్వము అభివృద్ధిపరచుకున్నప్పుడు యింతకంటె మించిన ధ్యానము ఏమిటి? ఏమి చేసినా దైవధ్యానముగానే వుంటుంది. దీనిలోని ఆనందము దేనిలో వుంది? భగవంతుడు నీ హృదయములో వున్నాడంటే ఎంత ఆనందము! భగవంతుని నివాసమెక్కడ? ఎక్కడో కాదు. హృదయవాసి. నాయందే భగవంతుడున్నాడనుకొంటే నీవు ఏ తప్పులూ చేయవు. ఏ దోషములోనూ ప్రవేశించవు. ఎవరికీ భయపడవు. ఎవరికోసం వెరువనక్కరలేదు. అందరినీ గౌరవించు. అందరినీ సరైన రీతిగా ప్రేమించు. అందరియందు దైవమున్నాడని విశ్వసించు. అంతేగాని ఎవరినీ ద్వేషించకు. అయితే నీ హృదయమును మరువవద్దు. దైవము అక్కడే వున్నాడు. బయట లేదు. worship a picture as God but not God as picture. ఆ తత్త్వాన్ని తీసుకోవాలి. నీ picture నీలోనే వుంది. దాన్ని భద్రము చేసుకో. విజ్ఞానము ఏమని బోధించినప్పటికి, వేదాంతము ఏమి చెప్పినప్పటికి కట్టకడపటికి మనకు నిల్చేది అణువే, అణువే. అంతా అణుమయమే.

చర్మచక్షువులకు కనిపించడు భగవంతుడు. ఈ చర్మచక్షువులకు కనిపించేది బాహ్య ప్రపంచమే. సూక్ష్మమైన జ్ఞాన నేత్రముతో చూడాలి. అప్పుడే నిజమైన దైవత్వము చక్కగా అర్థమవుతుంది. ఒరే, పిచ్చివాడనైనాను. నేనే దైవముగా వుండి నేను ఎందుకు పిచ్చి ఆటలాడాను? చాలా మందికి తెలుసు. తాగినవాడు ఏమేమో చేస్తుంటాడు. వాని action వానికే తెలియదు. తరువాత తన భార్యాబిడ్డలు నవ్వుతారు. మత్తు తీరిన తరువాత ఛీ నేను యిట్లా చేశానా అని తనే అవమానపడతాడు. అదేవిధముగా ఈనాడు జగత్సంబధమైన వాసనలలో నిండినవాడు తాగినవాడుగా కనిపిస్తాడు. విషయవాసనలలో మునిగిన వానికి ఏమీ తెలియదు. విషయవాసనల నుంచి విశ్వేశ్వర తత్త్వముతో నీవు బయలుదేరితే అప్పుడు నీయొక్క తత్త్వము నీకు అర్థమవుతుంది.

*దైవమే గురువు*

కనుక, మీరు పవిత్రమైన భావముచేత మీ హృదయమునందే వుండినట్లుగా విశ్వసించి, సర్వము నాకు భగవంతుడే, నిజమైన గురువు ఎవరు లేరు జగత్తులో. అందరికి గురువు ఒక్కడే. దైవము అన్ని దేశముల వారికి ఒక్కడే. కానీ, ఆ దైవాన్ని అనేక పేర్లతో పిలవవచ్చు. పేర్లు, రూపములు వేరు కావచ్చు. ఎన్ని టెస్టులు మీరు చేసినా అందులో మూలాధార తత్త్వము గుర్తించుకుంటూ పోవాలి. గులాబ్‌జాం, బర్ఫీ, మైసూర్‌పాక్, పాలకోవ ఎన్నెన్నో పేర్లు చెబుతుంటారు. అన్నింటిలో వున్నది చక్కెర. అదేవిధముగా దైవత్వము అన్నింటియందు వుంటున్నది. పిండిలో యేమాత్రము రుచి లేదు. దీనిలో చక్కెర కలిపినప్పుడు ఆ పిండే వుటుంది. బేడల పిండి యేమాత్రము రుచి లేదు. దీనినే చక్కెర వేసి లడ్డు చేస్తే తీయగా వుంటుంది. గుణసంపర్కముచేత ఈరీతిగా మారిపోతున్నది. మీరు భగవత్ సంపర్కముతో మీ జీవితాల్ని సార్థకము చేసుకోండి.

(1997 జూలై 20వ తేదీ యువకులకు భగవాన్ బాబావారి దివ్యసందేశము)